


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
23-12-2025
పేజీలు: 02



## భార్య లోదుస్తులపై ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం మాట్లాడినా సంచలనమే. తన ప్రత్యర్థులు, అమెరికా వ్యతిరేక దేశాలపై విరుచుకుపడే ట్రంప్.. తాజాగా తన భార్య, ఫస్ట్‌లేడీ మెలానియా దుస్తుల గురించి సంచలన వ్యాఖ్యలు చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. నార్త్ కరోలినాలో జరిగిన ఓ బహిరంగ ర్యాలీలో ట్రంప్ ఓ షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. తన భార్య మెలానియా ట్రంప్ లోదుస్తుల గురించి మాట్లాడి అందరినీ విస్మయానికి గురిచేశారు. తన ప్రసంగంలో ఆగస్టు 2022లో ఫ్లోరిడాలోని తన నివాసం మార్-ఎ-లాగోలో ఎఫ్‌బీఐ జరిపిన సోదాల గురించి ట్రంప్ ప్రస్తావించారు. ఆ సమయంలో ఫెడరల్ ఏజెంట్లు తన భార్య మెలానియా గదిలోకి వెళ్లారని ఆమె క్లోసెట్ మొత్తం వెతికారని చెప్పారు. మెలానియాకు సంబంధించిన వస్తువులన్నింటినీ వెతికినట్లు చెప్పారు. అక్కడ ఆమె లోదుస్తులు చాలా పద్ధతిగా, పర్ఫెక్ట్‌గా ఫోల్డ్ చేసి ఉన్నాయన్నారు. 'బహుశా ఆమె వాటిని ఐరన్ చేస్తారనుకుంటా' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. పబ్లిక్ ర్యాలీలో భార్యకు సంబంధించిన వ్యక్తిగత విషయాలను ప్రస్తావించడంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. భార్య లోదుస్తులపై ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు చేయడం హాట్‌టాపిక్‌గా మారింది.

## ఆడవారి దుస్తులపై శివాజీ వైరల్ కామెంట్స్




ఇటీవల వరుసగా ఆసక్తికరమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న నటుడు శివాజీ, తన రాబోయే సినిమా 'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలతో అనుకోకుండా వివాదంలో చిక్కుకున్నారు. ఆ ఈవెంట్‌లో మాట్లాడిన శివాజీ, హీరోయిన్ల దుస్తుల విషయంపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. సంప్రదాయ దుస్తులు, ముఖ్యంగా చీరలు, మహిళల అందం-ఆత్మగౌరవాన్ని మరింత పెంచుతాయని ఆయన అన్నారు. చిన్న దుస్తులు ధరించడం తప్పు కాదని చెప్పినప్పటికీ, అలాంటి ఎంపికలను సమాజం మౌనంగా తీర్పు వేస్తుందని వ్యాఖ్యానించారు. 'సరైన' దుస్తులు ధరిస్తే సహజమైన ఆకర్షణ, శోభ స్వయంగా కనిపిస్తాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, పలువురు నెటిజన్లతో పాటు కొంతమంది ప్రముఖుల నుంచి కూడా విమర్శలు ఎదుర్కొన్నాయి. నటీమణులు ఎలా దుస్తులు ధరించాలనే విషయంపై మాట్లాడే హక్కు శివాజీకి లేదని, ఆయన వ్యాఖ్యలు జోక్యంగా మరియు పాతకాలపు ఆలోచనలుగా ఉన్నాయని విమర్శకులు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఆన్‌లైన్‌లో చర్చ ఇంకా కొనసాగుతుండగా, ఈ వివాదం ఏ దిశగా వెళ్తుందో చూడాలి.




## 'మెగా 158'పై పెరుగుతున్న హైప్

మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా విడుదలకు రెడీ అవుతుండగా, వెంటనే దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో మరో భారీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ సినిమాను #ChiruBobby2, MEGA 158 అనే వర్కింగ్ టైటిల్స్‌తో పిలుస్తుండగా, 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరు — బాబీ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా సోషల్ మీడియాలో ఓ క్రేజీ న్యూస్ వైరల్ అవుతోంది.



# రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎండగట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. పంచాయతీ ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు. ZPTC, MPTC, GHMC ఎన్నికల్లో రిజల్ట్స్ అంతకు మించి వుండాలన్నారు. లడాయి మొదలైంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేసిందన్న కేసీఆర్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ నుంచి కౌంటర్ అటాక్ జోరందుకుంది. సమైక్య పాలన కంటే కేసీఆరే తెలంగాణకు తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టులపై కేసీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టాలని.. ఘాటుగా ఎండగట్టాలని మంత్రులకు దిశా నిర్దేశం చేశారారు. బీఆర్ఎస్ హయాంలో గోదావరి, కృష్ణా నీటి వాటాల విషయంలో జరిగిన అన్యాయాన్ని లెక్కలతో నిలదీయాలని సీఎం రేవంత్ సూచించారు. సోమవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో సీఎం సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినందుకు మంత్రులను ముఖ్యమంత్రి అభినందించారు. ఆ తర్వాత సాగునీటి ప్రాజెక్టులు, కృష్ణా—గోదావరి బేసిన్లలోని పరిస్థితి, పాలమూరు—రంగారెడ్డి ఎత్తిపోతలపై మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కృష్ణా, గోదావరి నదీజలాల అంశాలపై విస్తృతంగా చర్చించేందుకు డిసెంబర్ 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, రాష్ట్ర విభజన తర్వాత చేపట్టిన పనులు, ఖర్చులు వంటి అన్ని అంశాలను సభలో సమగ్రంగా చర్చించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే పాలమూరు — రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్ కేంద్రం నుంచి తిరిగి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఎన్జీటీ కేసు సమయంలో తాగునీటి ప్రాజెక్టుగా మాత్రమే చేపడతామని అప్పటి ప్రభుత్వం కోర్టులో చెప్పడంతో, 7.25 టీఎంసీలకే పరిమితి విధించారని సీఎం వివరించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 90 టీఎంసీల సామర్థ్యంతో పూర్తి స్థాయిలో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్న సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అభిప్రాయపడినట్లు సమాచారం.

**29న అసెంబ్లీ.. మూడు రోజుల విరామం?**

అసెంబ్లీ సమావేశాలు డిసెంబర్ 29వ తేదీన ప్రారంభమైన తర్వాత మూడు రోజుల విరామం ఇచ్చి, జనవరి 2 నుంచి తిరిగి కొనసాగించే అంశంపైనా మంత్రులతో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కృష్ణా, గోదావరి బేసిన్లపై సమగ్ర చర్చకు ప్రత్యేకంగా సమయం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. బీఆర్ఎస్ విధానం పాలమూరుతోపాటు మూడు జిల్లాలకు మరణశాసనం అయిందన్నారు. పదేళ్లలో కేసీఆర్ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు.ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి.. కేసీఆర్ వ్యాఖ్యలను ఘాటుగా తిప్పికొట్టాలి.. అలాగే బీఆర్ఎస్ వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగట్టాలని సీఎం రేవంత్ మంత్రులకు సూచించారు

## గూస్ బంప్స్ తెప్పిస్తున్న 'ది ఒడిస్సీ' ట్రైలర్!

'ఓపెన్‌హైమర్'తో ఆస్కార్‌ను కొల్లగొట్టిన గ్లోబల్ లెజెండరీ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ తన తదుపరి విజువల్ వండర్ 'ది ఒడిస్సీ'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. గ్రీకు పురాణాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 17న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హోమర్ రాసిన పురాతన గ్రీకు మహాకావ్యం 'ది ఒడిస్సీ' ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ట్రోజన్ యుద్ధం ముగిసిన తర్వాత 'ఒడిస్సియస్' తన స్వస్థలమైన ఇథాకాకు చేరుకోవడానికి పదేళ్లపాటు సముద్రంలో ఎదుర్కొన్న సాహసోపేతమైన ప్రయాణం, గ్రీకు దేవతలు, రాక్షసులతో చేసిన పోరాటాన్ని నోలన్ తన స్టైల్‌లో చూపించబోతున్నారు. ఇందులో ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటిస్తుండగా, ఇతర ప్రధాన పాత్రల్లో టామ్ హాలండ్ (కుమారుడు టెలిమాకస్‌గా), యాన్ హాత్వే (భార్య పెనెలోప్ గా) కనిపిస్తున్నారు. ఇంకా జెండయా, రాబర్ట్ ప్యాటిన్సన్ వంటి స్టార్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఈ సినిమాను పూర్తిగా సరికొత్త IMAX 70mm




టెక్నాలజీతో చిత్రీకరించినట్లు తెలుస్తుంది.

## ప్రజా పాలన కాదు.. పక్కా మాఫియా పాలన

తెలంగాణలో నడుస్తోంది ప్రజా పాలన కాదు.. "పక్కా మాఫియా పాలన" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నాడు ఎన్నికల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద బాంబులు వేశారని.. నేడు ఇసుక మాఫియా కోసం ఏకంగా చెక్ డ్యామ్‌ల మీద జెలటిన్ స్టిక్స్‌తో బాంబులు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాటర్ మ్యాన్ రాజేంద్ర సింగ్ "ఇది మానవ నిర్మిత విధ్వంసం" అని మొత్తుకుంటున్నా, ఈ 'చిట్టి నాయుడి' ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. డ్రిల్లింగ్ మెషీన్లతో హోల్స్ చేసి, జెలటిన్ స్టిక్స్ పెట్టి పేల్చారని ఆయన సాక్ష్యాలతో సహా నిరూపించారని అన్నారు.ఇసుకను దోచుకోవడానికి అడ్డుగా ఉన్నాయని, కోట్ల రూపాయల ప్రజా ధనంతో కట్టిన చెక్ డ్యామ్‌లను డైనమైట్లు పెట్టి పేల్చేస్తారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వమా లేక గ్యాంగ్ స్టర్ల అడ్డాయా అని నిలదీశారు. భూగర్భ జలాలు పెరగాలని మేం చెక్ డ్యామ్‌లు కడితే.. వాటిని కూల్చివేసి రైతుల పొలాలను ఎడారిగా మారుస్తున్నారని మండిపడ్డారు. మీ ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కోసం తెలంగాణ రైతాంగం బలి కావాలా అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్ర సింగ్ గారి రిపోర్ట్ చెంపపెట్టు అని




కేటీఆర్ అన్నారు. ఇప్పుడు మీ సమాధానం ఏంటి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయడం చేతకాదు కానీ, ఉన్న ఆస్తులను కూల్చడంలో మీరు సిద్ధహస్తులని విమర్శించారు. తెలంగాణ ఆస్తులపై బాంబులు వేస్తున్న మాఫియా వెనుక ఉన్న అసలు దొంగలను బయటపెట్టండని డిమాండ్ చేశారు. రాజేంద్ర సింగ్ డిమాండ్ చేసినట్లు పీపుల్స్ ఎంక్వైరీ కమిషన్ వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే ఈ బాంబుల సెగ మీ కుర్చీ దాకా రావడం ఖాయమని హెచ్చరించారు.

## తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్

రాష్ట్రంలోని విద్యుత్ శాఖ ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రతి ఏటా ఉద్యోగులకు అందించే కరువు భత్యం డీఏను 17.651 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ధరలు నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ పెంచిన డీఏను గత జూలై నెల నుంచి అమలయ్యే విధంగా అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యుత్ శాఖ పరిధిలోని పనిచేస్తున్న 71,387 వేల మంది ఉద్యోగులు, ఆర్టిజెన్లు, పెన్షనర్లు లబ్ధి చేకూరనుంది.

## నాని సినిమాకు నో చెప్పిన జాన్వీ కపూర్!

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ద పారడైజ్'లో హీరోయిన్ పాత్రకు జాన్వీ కపూర్ నో చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. భారీ ఆఫర్ వచ్చినా, ఆమె డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జాన్వీ చేతిలో ఇప్పటికే అరడజనుకు పైగా సినిమాలు ఉండటంతో, కొత్త ప్రాజెక్టుకు సంతకం చేస్తే ఇబ్బంది అవుతుందని భావించిందని సమాచారం. దీంతో చిత్ర యూనిట్ మరో హీరోయిన్ కోసం అన్వేషణ ప్రారంభించింది.



సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
EVENING EDITION 4PM




## 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' టీజర్ రిలీజ్‌కి టైం ఫిక్స్

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ గత కొంతకాలంగా సరైన హిట్ లేక సతమతమవుతున్నాడు. ఇటీవల తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన 'సికందర్' భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. దీంతో సల్మాన్ కంబ్యాక్ కోసం ఆయన అభిమానులు ఈగర్‌గా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే సల్మాన్ ఓకే చేసిన కొత్త సినిమా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాను దర్శకుడు అపూర్వ లఖియా తెరకెక్కిస్తున్నారు. మిలిటరీ వార్ డ్రామా కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ దాదాపు 50 శాతం పూర్తైనట్లు సమాచారం. అంతకుముందే విడుదలైన సల్మాన్ ఖాన్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి అదిరిపోయే రెస్పాన్స్ రావడంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో తాజాగా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' మూవీ టీజర్‌కు సంబంధించిన క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదేంటంటే, ఈ మూవీ టీజర్‌ను డిసెంబర్ 27న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. దీంతో సల్మాన్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. అయితే, ఈ విషయంపై ఇంకా మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# కార్పొరేషన్‌గా హైదరాబాద్ మెట్రో!



హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్ భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త అడుగులు వేస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు దాటి విస్తరించడంతో మెట్రో రైల్ నెట్‌వర్క్ ను కూడా ఆ మేరకు 400 కి.మీ మేర విస్తరించాలన్న ప్రణాళికలు ఉన్న నేపథ్యంలో మెట్రో నిర్వహణ కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, దానికి స్వయం ప్రతిపత్తి కల్పించాలని భావిస్తోంది. ఢిల్లీలో మెట్రో రైలు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) తరహాలోనే హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు సమీకరించాలని చూస్తున్నాయి. మొత్తం పనులన్నీ పూర్తయ్యాక మొదటిదశ, రెండోదశను కార్పొరేషనే పర్యవేక్షించనుంది. ఇక ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండోదశ మెట్రో విస్తరణకు భూ సేకరణ తక్కువ అవసరమవుతుందని, హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ (హెచ్‌ఏఎంఎల్) వర్గాలు చెబుతున్నాయి. నాగోల్, ఎల్బీనగర్ మీదుగా విమానాశ్రయం వరకు నిర్మిస్తున్న కారిడార్‌కు, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న మరో కారిడార్‌కు మాత్రమే 70 శాతం భూములను సేకరించాల్సి ఉంటుందని, ఇతర మార్గాల్లో 30 శాతం సరిపోతోందని చెబుతున్నారు. మెట్రో సెకండ్ ఫేజ్‌లో భాగంగా పార్ట్-ఏ కింద ప్రతిపాదించిన 5 కారిడార్లలోని 76.4 కిలో మీటర్ల కోసం రూ.24,269 కోట్లు, పార్ట్-బీ కింద ప్రతిపాదించిన 3 కారిడార్లలోని 86.1 కి.మీ కోసం రూ.19,579 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. మొత్తం ప్రాజెక్టును 50:50 జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే నిర్ణయించాయి. మొత్తం ఎనిమిది కారిడార్లకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) హెచ్‌ఏఎంఎల్ అధికారులు కొన్ని నెలల క్రితం కేంద్ర ప్రభుత్వానికి పంపారు. అక్కడి నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు.





## రాజమౌళి వారణాసి హాలీవుడ్‌లో?

సినిమాను తెరకెక్కించడంలోనే కాదు, దాన్ని ప్రమోట్ చేయడంలో.. మార్కెటింగ్ జరపడంలోనూ దిట్ట దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి. ప్రస్తుతం ఆయన అంతర్జాతీయ స్థాయిలో 'వారణాసి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు అంబరాన్ని తాకాయి. దీనికి తగ్గట్టుగా ఈ సినిమా బడ్జెట్ విషయంలో కూడా రకరకాల ఊహాగానాలు ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. 700కోట్ల బడ్జెట్ అని ఒకరంటే.. కాదు వెయ్యి కోట్లని మరొకరు. కానేకాదు 1500కోట్లని ఇంకొకరు. ఇలా ఈ సినిమా బడ్జెట్ విషయంలో చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. అయితే.. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమాకు నిర్మాత కె.ఎల్.నారాయణ అన్ లిమిటెడ్ బడ్జెట్‌ని కేటాయించారట. కథ డిమాండ్ మేరకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదనే పంథాలో ఆయన ముందుకెళ్తున్నట్టు తెలిసింది. వాస్తవానికి ఖర్చు ఎంతైనా, దాన్ని రాబట్టుకోవడం రాజమౌళికి బాగా తెలుసు. అందుకే 'వారణాసి' హాలీవుడ్ వెర్షన్‌ని కూడా ఆయన సిద్ధం చేస్తున్నారట. హాలీవుడ్ ప్రేక్షకులకు 'వారణాసి' నచ్చితే.. ఆ అంకెలు వేరే విధంగా ఉంటాయని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ దాకా వెళ్లడంతో హాలీవుడ్‌లోనూ రాజమౌళి గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమా బిజినెస్ పూర్తయిన తర్వాతే పారితోషికాలు తీసుకోవాలని రాజమౌళి, మహేశ్‌బాబు భావించారట. దాంతో ప్రస్తుతం నిర్మాత ప్రతి పైసా సినిమాకే ఖర్చు చేస్తున్నట్టు తెలిసింది. ఏదేమైనా రాజమౌళి స్ట్రాటజీనే వేరు.




## వన్ టైమ్ స్కీమ్‌ను ప్రకటించిన జీహెచ్‌ఎంసీ

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తి పన్నుకు సంబంధించి సోమవారం ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపులపై వన్ టైమ్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 90 శాతం వరకు రాయితీ పొందవచ్చని నగరవాసులకు శుభవార్తను అందించింది.ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆస్తుల పెండింగ్ బకాయిలపై ఈ రాయితీ ఇవ్వబడుతుంది. వినియోగదారులు కేవలం ఆస్తి పన్నులో వడ్డీని 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని జీహెచ్‌ఎంసీ తెలిపింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని రకాల ప్రైవేటు మరియు ప్రభుత్వ ఆస్తులకు ఈ రాయితీ వర్తిస్తుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలియజేశారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిని విస్తరించిన విషయం తెలిసిందే. 27 మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. జీహెచ్‌ఎంసీలో విలీనమైన ప్రాంతాలకు కూడా ఈ ప్రత్యేక రాయితీ వర్తిస్తుంది. ఈ రాయితీ ద్వారా ప్రజలపై భారం తగ్గడంతో పాటు జీహెచ్‌ఎంసీకి గణనీయమైన ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

## నజ్రియా హాట్ సారీ లుక్స్

నజ్రియా నజీమ్. మలయాళంలో ఈ చిన్నదానికి విపరీతమైన క్రేజ్ ఉంది. అలాగే తెలుగు ఒకే ఒక్క సినిమా చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో నేచురల్ స్టార్ నాని సరసన నటించింది నజ్రియా నజీమ్. అంటే సుందరానికి అనే సినిమా చేసి ప్రేక్షకులను మెప్పించింది నజ్రియా నజీమ్. ఆ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ఫేవరెట్ హీరోయిన్ అయ్యింది. తెలుగులో ఈ సినిమా తర్వాత మరో సినిమాలో నటించలేదు. కానీ మలయాళంలో వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది ఈ వయ్యారి భామ. ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా నజ్రియా నజీమ్ తన భర్త ఫహద్ ఫాజిల్ గురించి ఓ షాకింగ్ విషయాన్ని చెప్పింది.ఇదిలా ఉంటే మొన్నామధ్య నజ్రియా భర్త ఫహద్ నుంచి విడిపోతుందంటూ వార్తలు పుట్టుకొచ్చాయి. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే నజ్రియా కొద్దిరోజులుగా సైలెంట్ గా ఉంటుంది. మొన్నామధ్య సూక్ష్మ దర్శిని అనే సినిమా చేసింది. దాంతో ఆమె అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, నజ్రియా జీవితంలో ఏం జరుగుతుంది అంటూ ఆరాలు తీస్తున్నారు.ఇదిలా ఉంటే మొన్న ఓ కార్యక్రమానికి భర్త ఫహద్ ఫాజిల్ తో కలిసి పాల్గొంది. దాంతో రూమర్స్ కు చెక్ పడింది. ఇటీవలే ఓనం కూడా సెలబ్రేట్ చేసుకుంది. ప్రస్తుతం నజ్రియా వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. ఇప్పటికే రెండు మూడు సినిమాలు చేస్తుంది. ఇటీవలే ఓ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుస్తుంది. ఈ సినిమాలో టోవినో థామస్‌తో కలిసి నటిస్తుంది. ఈ సినిమా రొమాంటిక్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతోందని తెలుస్తుంది.

## జనవరి 1 నుంచే ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెంపు



వచ్చే ఏడాది నుంచి వివిధ కార్ల ధరలు పెంచుతున్నట్లు ఆయా కంపెనీలు ప్రకటనలు చేస్తున్నాయి. ఇతర టూ-వీలర్ ఎలక్ట్రిక్ స్కూటర్లు, వాహనాల తయారీ కంపెనీలు ధరల పెంపును ప్రకటించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రముఖ ఎలక్ట్రిక్ టూ-వీలర్ తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తమ కస్టమర్లకు షాకిచ్చింది. తమ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెంచుతన్నట్లు ప్రకటన చేసింది. కొత్త ఏడాది అంటే జనవరి 1, 2026 నుంచే పెంచిన ధరలు అమలులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. అన్ని మోడళ్లపై గరిష్ఠంగా రూ.3 వేల వరకు పెంపు ఉంటుందని వెల్లడించింది. ముడి సరకు ధరలు పెరగడం, అంతర్జాతీయంగా కీలక ఎలక్ట్రానిక్ ఉపకరణాల ధరలు పెరగడం, ఫారెక్స్ ప్రభావం కారణంగా ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినట్లు ఏథర్ ఎనర్జీ కంపెనీ వెల్లడించింది. ధరల పెంపు ఒక్కో మోడల్ పై ఒక్కోలా ఉంటుందని కంపెనీ తెలిపింది. అదే సమయంలో డిసెంబర్ స్కీమ్ ద్వారా ఎంపిక చేసిన పట్టణాలు, నగరాల్లో ఏథర్ స్కూటర్ కొనుగోళ్లపై రూ.20 వేల వరకు ప్రయోజనాలను అందిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఏథర్ కంపెనీ 450 సిరీస్‌లో పెర్ఫార్మెన్స్ స్కూటర్లు, రిజ్తా పేరిట్ ఫ్యామిలీ స్కూటర్లు మార్కెట్లో ఉన్నాయి. ఆయా స్కూటర్ల ధరలు రూ. 1,14,546 నుంచి ప్రారంభమవుతున్నాయి. గరిష్ఠంగా ఈ స్కూటర్ల ధరలు రూ. 1,82,946 వరకు ఉన్నాయి.

## వైజాగ్ పూర్ణ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం



విశాఖపట్నం పూర్ణ మార్కెట్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఆరు దుకాణాలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైర్ ఇంజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో వ్యాపారులు పెద్ద ఎత్తున రంగులు తీసుకొచ్చి స్టోర్ చేశారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఒక షాపులో మంటలు చెలరేగాయి. అవి కాస్త ఎక్కువై.. ఇతర షాపులకు కూడా వ్యాపించాయి. దీంతో ఆరు షాపుల్లోని సామగ్రి మొత్తం పూర్తిగా దగ్ధమైంది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదు.. కానీ వ్యాపారులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేస్తున్నారు.